


RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :106 | సోమవారం ఆగస్ట్ 10, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 6 | వెల-5

## కామన్వెల్త్ పతక విజేతలతో..



2లో

## ఫ్లెక్సీ వివాదం..

**బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ**



శివ్వంపేట: బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత మాధవరెడ్డి వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో ఆదివారం బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో వివాదం రాజుకుంది. పోలీసులు ఫ్లెక్సీలు తొలగించి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం తమపై దాడి చేశారని ఇరు వర్గాల కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పరస్పరం పోలీసులను ఫిర్యాదు చేశారు.



## పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి కేసీఆర్..

### కుటుంబ సభ్యులకు పరామర్శ

**కేసీఆర్ భావోద్వేగం**

- నల్లబెల్లిలో మాజీ సీఎం కేసీఆర్ పర్యటన
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మకు హాజరు
- కుటుంబసభ్యులను పరామర్శించిన కేసీఆర్
- సుదర్శన్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న కేసీఆర్
- "అత్యంత సాదాసీదా జీవితం గడిపారు" అంటూ భావోద్వేగం
- కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా
- పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం
- కుటుంబసభ్యులకు చెక్కు అందజేసిన కేసీఆర్
- కేసీఆర్ రాకతో భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు
- నివాసం వద్ద స్వల్ప తోపులాట
- రంగంలోకి దిగిన పోలీసులు.. కేసీఆర్ కాన్వాయ్‌ను లోపలికి తరలింపు



వరంగల్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ (ఖజ=) వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్ అత్యంత సాదాసీదా జీవితం గడిపారన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయం చెక్కును కుటుంబసభ్యులకు కేసీఆర్ అందజేశారు.

కేసీఆర్ రాక నేపథ్యంలో నల్లబెల్లికి భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద కార్యకర్తలు కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. పోలసులు రంగంలోకి దిగి కేసీఆర్ కాన్వాయ్‌ను సుదర్శన్‌రెడ్డి నివాసం లోపలికి తీసుకెళ్లారు.

## ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ క్రైమే ప్రధాన సవాళ్లు: డీజీపీ సీవీ ఆనంద్



వరంగల్: తెలంగాణలో మావోయిజం దాదాపు పూర్తిగా కనుమరుగైందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. మావోయిస్టు బాధిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఆదివారం వరంగల్‌లో పర్యటించిన ఆయన.. ఐపీఎస్‌గా తన ప్రస్థానం ఈ జిల్లాలోనే ప్రారంభమైదని చెప్పారు. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ క్రైమ్ ప్రధాన సవాళ్లుగా మారాయన్నారు. సైబర్ నేరాలతో ప్రజలు భారీగా డబ్బు నష్టపోతున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో అధిక లాభాల ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## 533 మందితో తైక్వాండో ప్రదర్శన..

### గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు



గచ్చిబౌలి: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 'తైక్వాండో లెసన్' ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఎంజేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 9 ఏళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు మొత్తం 533 మంది పాల్గొని, 35 నిమిషాల పాటు వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. గతంలో 302 మందితో చేసిన ప్రదర్శనను.. తాజాగా అధిగమించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు పరిశీలకుడు స్వప్నిల్ నిర్వాహకులకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

# స్వర్ణాంధ్ర కోసం సంకల్పం



- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- దేశ నిర్మాణంలో పౌరుల భాగస్వామ్యం కీలకం
- ఆదివాసీల అభివృద్ధికి ఐదు అంశాల ప్రణాళిక
- అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం
- గిరిజన ప్రాంతాల్లో రూ.1000 కోట్లతో రహదారులు
- సురక్షిత తాగునీరు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం
- 60 వేల మందికి లబ్ధి చేకూరేలా ఎంఓయూలు
- నైపుణ్య శిక్షణ ద్వారా ఉద్యోగ అవకాశాలు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం




**అమరావతి, ఆగష్టు 09**

దేశానికి, రాష్ట్రానికి విజన్ ఉన్నట్లే ప్రతీ పౌరుడికి ప్రత్యేక విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. 2047 స్వర్ణాంధ్ర సాధన కోసం ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**ఆదివాసీల సమగ్రాభివృద్ధి**

ప్రకృతిని ఆరాధిస్తూ జీవించే గిరిజనులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజనుల అభివృద్ధికై రూ.4,764 కోట్లు కేటాయించామని తెలిపారు. 2,336 గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు.

**అరకు కాఫీకి గ్లోబల్ గుర్తింపు**

అరకు కాఫీని అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పోడు వ్యవసాయం స్థానంలో ఆర్గానిక్ పంటలు పండించేలా గిరిజనులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.

**ఐదు కీలక అంశాల ప్రణాళిక**

రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి కల్పన అనే ఐదు అంశాలతో కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు.

2లో

### ప్రకాశం బ్యారేజ్ వద్ద గోదావరి

## జలాలను పరిశీలించిన సీఎం



- పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 17.52 టీఎంసీల నీటి తరలింపు
- ప్రకాశం బ్యారేజ్ పై కొద్దిసేపు కాన్వాయ్ నిలిపి సీఎం పరిశీలన
- కాలువల ద్వారా పంటలకు 7,158 క్యూసెక్కుల నీరు విడుదల
- వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు జీవం పోస్తున్న గోదావరి జలాలు
- సమర్థ నీటి నిర్వహణతో సాగునీటి ఇబ్బందులు అధిగమించాలని ఆదేశం

2లో

## మెడికో ప్రియాంక మృతి..

### ధ్రువీకరించిన కిమ్స్ వైద్యులు



2లో

- బాధితురాలు: ప్రియాంక (GSL కాలేజీలో డెర్మటాలజీ పీజీ విద్యార్థిని).
- స్వస్థలం: ఏక్లాస్‌పూర్ (జోగులాంబ గద్వాల జిల్లా); కుటుంబం హైదరాబాద్‌లో నివాసం.
- సంఘటన: రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్యమాల్ వద్ద మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు కారుతో బైక్‌ను మూడుసార్లు బలంగా ఢీకొట్టారు.

## బాలినేని కూటమిలో ఉన్నారని మౌనంగా ఉన్నాం: దామచర్ల జనార్దన్ కౌంటర్



2లో

ఒంగోలు: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పై కరపత్రాలు ముద్రిస్తే పుస్తకాలు సరిపోవని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. కూటమిలో విభేదాలు సృష్టించేలా ఆయన మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## కమలంలో కాక్రోచ్ కలవరం!

రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడంలో విజయం సాధిస్తూ వచ్చిన ప్రధాని మోదీ అదే మార్గంలో యువతను కట్టడి చేయలేమని గుర్తించినట్టున్నారు. రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులకు అనేక బలహీనతలు ఉంటాయి. వాటిని ఉపయోగించుకొని వారందరినీ బీజేపీ పెద్దలు కట్టడి చేస్తూ వచ్చారు. ఈ కారణంగానే ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన అనేక గొంతులు మూగబోయాయి. యువత పరిస్థితి వేరు. పోరాడితే పోయేది ఏమీ లేదు– మహా అయితే సంకెళ్లు పోతాయి అన్నట్టుగా యువత ధోరణి ఉంటుంది. బొద్దింకల ఉద్యమంలో అదే కనిపించింది.

ఆరెస్సెస్ కూడా గత కొంత కాలంగా కేంద్ర పెద్దల పోకడల పట్ల సంతృప్తిగా లేదన్న ప్రచారం ఉంది. బొద్దింకల ఉద్యమం, ఆ తర్వాత బిహార్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఖాళీ చేసిన అసెంబ్లీ స్థానాన్ని ఉప ఎన్నికల్లో కోల్పోయిన తర్వాత ఆరెస్సెస్ పెద్దలు తమ అభిప్రాయాలను బాహాటంగా చెప్పడం మొదలెట్టారు. చర్చకు మరో రూపమే నిరసన అని, ప్రజాస్వామ్యంలో అది చట్టబద్ధమని, సమస్యలను పట్టించుకోకపోతే ఆందోళనలు పుట్టుకొస్తాయని, ఎన్నికల్లో విజయాలే నాయకత్వానికి నిదర్శనం కాదని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మోదీని దృష్టిలో పెట్టుకొని చేసినవే అన్న అభిప్రాయం ఏర్పడింది.

జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత మోదీ కొంత డల్‌గా కనిపిస్తున్నారు. తాజా పరిణామాలు తొలి ఎదురుదెబ్బగా పేర్కొనవచ్చు. ఈ నేపథ్యంలో భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నుంచి మోదీకి అనూహ్య మద్దతు లభించింది. వారిద్దరూ మోదీని ఆకాశానికెత్తారు. మోతాదుకు మించి ప్రధానిని పొగిడారన్న అభిప్రాయం కూడా ఉంది. మోదీ బలంగా ఉన్నప్పుడు చంద్రబాబు 2019లో ఆయనతో గొడవ పెట్టుకున్నారని, ఇప్పుడు మోదీ బలహీనపడుతున్నప్పుడు అవసరానికి మించి నెత్తిన పెట్టుకుంటున్నారన్న అభిప్రాయం టీడీపీ నాయకుల్లోనే ఉంది.

తాము ప్రెషర్ గ్రూపుగా పనిచేస్తామని కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు ప్రకటించడం శుభపరిణామం. రాజకీయాల్లో బురద పూసుకొనేవారు ఉంటారు కనుక ఆ బురదను కడిగే వాళ్లూ ఉండాలి. మన దేశంలో అంతో ఇంతో ప్రజాదరణ పొందిన వాళ్లు విజిల్ బ్లోయర్ పాత్ర ఎంచుకోకుండా రాజకీయాల్లోకి వెళ్లి కనుమరుగవుతున్నారు. అందుకే ఒత్తిడి తీసుకురాగలిగిన ప్రెషర్ గ్రూపు అవసరం.

మన దేశంలో ఏ ఒక్క వ్యవస్థ కూడా స్వతంత్రంగా పనిచేయడం లేదు. ఇంకా చెప్పాలంటే వాటిని పనిచేయనివ్వడం లేదు. పై వాళ్ల ఆదేశాలకు అనుగుణంగా వ్యవస్థలు నడుచుకుంటున్నాయి. సీజేపీ రూపంలో ఇప్పుడు మన దేశంలో జవాబుదారీతనం కోసం ప్రారంభమైన ఉద్యమం అలా చల్లబడి పోకూడదని కోరుకుందాం.

జాతీయ రాజకీయాలలో బాహుబలిగా ఎదిగి, 2029 ఎన్నికల్లో కూడా మెజారిటీ సాధించి నాలుగో పర్యాయం ప్రధానమంత్రిగా కొనసాగాలని తలపోస్తున్న నరేంద్ర మోదీ ప్రభ మసకబారుతోందా? గతంలో రైతులు నెలల తరబడి ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలకు ఏమాత్రం చలించని ప్రధాని మోదీ, నీట్ ప్రశ్నపత్రం లీకేజ్‌పై కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన ఉద్యమానికి తలొంచారా? ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడమే నాయకత్వానికి నిదర్శనం కాదని ప్రధాని మోదీని దృష్టిలో ఉంచుకొనే ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారా? అని ప్రశ్నించుకుంటే 'అవును' అనే సమాధానం వస్తోంది. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమంలో నిజానికి లక్షల సంఖ్యలో విద్యార్థులు పాల్గొనలేదు. ఆ ఉద్యమంలో పాల్గొన్న వారి సంఖ్య పది వేలకు మించి ఉండదని ఒక అంచనా. అంతకు మించిన సంఖ్యలో రైతులు చేపట్టిన ఉద్యమానికి ప్రధాని మోదీ ఎందుకు దిగి రాలేదు? అంటే కారణం లేకపోలేదు. రైతు ఉద్యమంలో కేవలం పంజాబ్, హరియాణాకు చెందిన రైతులే ఎక్కువగా పాల్గొన్నారు. వారి ఉద్యమానికి సంఘీభావంగా ఇతర రాష్ట్రాల రైతులు ఉద్యమ బాట పట్టలేదు. విద్యార్థులు చేపట్టిన ఉద్యమం అలా కాదు. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల్లో ఎంత మంది పాల్గొన్నారనే దానికంటే... సదరు ఉద్యమానికి మద్దతుగా అనేక రాష్ట్రాలలో, ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో విద్యార్థులు రోడ్డెక్కడం కీలకం! బహుశా ఈ పరిణామం ప్రధాని మోదీ ఒక మెట్టు దిగి వచ్చేలా చేసి ఉంటుంది. జెన్‌--జీ ఉద్యమాల వల్ల శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లలో ప్రభుత్వాలు మారిపోయాయి. ఇప్పుడా దేశాలలో జెన్‌--జీ ప్రభావం కనిపిస్తోందా? అంటే అది వేరే విషయం! మన దేశంలో కూడా జెన్‌--జీ ఉద్యమాలు ప్రభుత్వాలను మార్చగలవా? అంటే ఆ పరిస్థితి లేదనే చెప్పాలి. అయితే... దేశ ప్రజలలో, ముఖ్యంగా యువతలో అశాంతి, అసహనం నెలకొన్న విషయాన్ని జంతర్ మంతర్ ఉద్యమం ప్రస్ఫుటం చేసింది. ఈ కారణంగానే క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించిన ప్రధానమంత్రి మోదీ రాజీకి దిగి వచ్చి విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించి ఉంటారు.

**ఊహించని విస్తరణ**

నిజానికి విద్యార్థుల ఉద్యమాన్ని బీజేపీ పెద్దలు ప్రారంభంలో సీరియస్‌గా తీసుకోలేదు. ఫలితంగా ఉద్యమం విస్తరించింది. నరేంద్ర మోదీ వంటి బలమైన నాయకుడు ఇలాంటి ఉద్యమాలకు తలొగ్గుతారని ఎవరూ ఊహించలేదు. అయితే, రాజకీయ పరిశీలకుల అంచనాలకు భిన్నంగా ప్రధాని మోదీ విద్యార్థుల డిమాండ్లకు ఓకే చెప్పారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ కూడా మొదటిసారిగా పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వద్ద గంటల తరబడి ఆందోళన చేశారు. చివరికి వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని వ్యాన్‌లలో తరలించవలసి వచ్చింది. ఈ సంఘటనతో రాహుల్ గాంధీలో ఫైటర్ ఉన్నాడన్న భావన రాజకీయ పరిశీలకులలో ఏర్పడింది. రాజకీయ పార్టీలే కాదు-- ఇతర వ్యవస్థలు కూడా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమాన్ని ప్రారంభంలో సీరియస్‌గా తీసుకోలేదు. అయితే, జంతర్ మంతర్ వద్ద చోటుచేసుకున్న పరిణామాల తర్వాత ఆయా వ్యవస్థలు, ఆ వ్యవస్థల్లోని ప్రముఖులు గొంతులు సవరించుకున్నారు. ప్రముఖుల స్వరాలు మారాయి అనే దానికంటే ఆయా వ్యవస్థలు ఉలిక్కిపడ్డాయనడం సబబుగా ఉంటుంది. రాజకీయ పార్టీలు, న్యాయ వ్యవస్థతో పాటు మీడియాపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతున్న దాఖలాలు కొంత కాలంగా కనిపిస్తున్నాయి. తమకు జవాబుదారీతనం కావాలని ఈ దేశ యువత, ముఖ్యంగా విద్యార్థులు కోరుకుంటున్నారని ఆయా వ్యవస్థలు మొదటిసారిగా గుర్తించాయి. రాజ్యాంగ పరమైన రక్షణలో ఉన్న న్యాయ వ్యవస్థ కూడా పరిస్థితి తీవ్రతను గుర్తించాల్సి రావడం ముదావహం. విద్యార్థులు రాళ్లు రువ్వినా ప్రభుత్వం బల ప్రయోగం చేయరాదని సుప్రీం కోర్టు సూచించడం ఇటీవలి కాలంలో యువత సాధించిన విజయంగా పేర్కొనవచ్చు. న్యాయ వ్యవస్థ సైతం దిద్దుబాటు చర్యలు చేపట్టిన నేపథ్యంలో రాజకీయమే శ్వాసగా ఎదిగిన ప్రధానమంత్రి మోదీ మాత్రం పరిస్థితులను ఆకళింపు చేసుకోకుండా ఉంటారా? పరిస్థితులు అనువుగా లేనప్పుడు ఒక అడుగు వెనక్కు తగ్గడం ఓటమిని అంగీకరించడం కాదు. అదొక యుద్ధ నీతి! అందుకే విద్యార్థుల విషయంలో ప్రధాని మోదీ వెనక్కు తగ్గారు. ఈ చర్య ద్వారా తన ప్రభుత్వంపై యువతలో వ్యతిరేకత విస్తరించకుండా కట్టడి ప్రయత్నాలకు ఆయన శ్రీకారం చుట్టారని భావించవచ్చు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడంలో విజయం సాధిస్తూ వచ్చిన ప్రధాని మోదీ అదే మార్గంలో యువతను కట్టడి చేయలేమని గుర్తించినట్టున్నారు.

**భిన్న అనుభవం...**

రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులకు అనేక బలహీనతలు ఉంటాయి. ఆ బలహీనతలను ఉపయోగించుకొని వారందరినీ బీజేపీ పెద్దలు కట్టడి చేస్తూ వచ్చారు. ఈ కారణంగానే ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన అనేక గొంతులు మూగబోయాయి. అధికారానికి ఎదురొడ్డి పోరాడలేకపోయాయి. యువత, ముఖ్యంగా విద్యార్థుల పరిస్థితి వేరు. పోరాడితే పోయేది ఏమీ లేదు-- మహా అయితే సంకెళ్లు పోతాయి అన్నట్టుగా యువత ధోరణి ఉంటుంది. బొద్దింకల రూపంలో జరిగిన ఉద్యమంలో అదే కనిపించింది. ప్రభుత్వాలలో నిరంకుశ పోకడలు పొడసూపినప్పుడు ఏదో ఒక రూపంలో ఆందోళనలు పుట్టుకొస్తాయి.

## కామన్వెల్త్ పతక విజేతలతో..

కామన్వెల్త్ క్రీడల పతక విజేతలు ప్రధాని నరేంద్ర మోదీని దిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన ప్రధాని.. వారి ఆట తీరును ప్రశంసించారు. అనంతరం ఈ భేటీకి సంబంధించిన ఓ సెల్ఫీ వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించిన బాక్సర్ సాక్షి చౌదరి.. ప్రధాని మోదీ, మిగతా క్రీడాకారులతో ఈ సెల్ఫీ వీడియో తీశారు. "కామన్వెల్త్ క్రీడల పతక విజేతలందరినీ ప్రధాని ఆహ్వానించారు. అందుకు మేం గర్వపడుతున్నాం. ఆయన్ను కలవడం చాలా సంతోషంగా ఉంది" అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. "జో ఖేలేగా.. వో ఖిలేగా.. (ఎవరైతే ఆటలాడతారో.. వారు ఎదుగుతారు). ఎల్లప్పుడూ భారత్‌కు మద్దతు తెలపండి" అని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ తమ అద్భుతమైన ప్రదర్శనతో దేశానికి గర్వకారణంగా నిలిచారని, వారి విజయం ఎంతో మంది యువతకు స్ఫూర్తినిస్తుందని పేర్కొంటూ మరో పోస్ట్ పెట్టారు.

ఇటీవల గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం 39 పతకాలు సాధించింది. మెడల్స్ పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. భారత్ గెలిచిన 13 స్వర్ణాల్లో బాక్సింగ్ నుంచే ఏడు ఉండటం విశేషం.

## ఆర్జీకర్ ఘటన.. మరోసారి దర్యాప్తునకు సీఎం ఆదేశం



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీకర్ హత్యాచార కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై మరోసారి దర్యాప్తునకు ఆదేశించినట్లు బెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రకటించారు. మృతురాలి తల్లి, ప్రస్తుత భాజపా ఎమ్మెల్యే రత్న దేబ్‌నాథ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో పోలీసులు తమ విధి నిర్వహణలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

"ఈ కేసులో కొత్తగా దర్యాప్తు జరపాలని కోరుతూ రత్న దేబ్‌నాథ్ నాకు లేఖ రాశారు. ఈ క్రమంలోనే సీఎస్‌తోపాటు నిపుణుల బృందంతో విస్తృత చర్చల అనంతరం.. మరోసారి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశాను" అని సీఎం సువేందు పేర్కొన్నారు. అదేవిధంగా బాధితురాలి అంత్యక్రియల నిర్వహణలో జరిగిన లోపాలపై కూడా ప్రత్యేక దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు, ఈ ఘటనకు నేటితో రెండేళ్లు పూర్తి కాగా.. బాధితురాలికి నివాళిగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

**మమతా బెనర్జీ కారుపై దాడి**

2024 ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్యకళాశాల– ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. కోల్‌కతాలోని సియాల్దా కోర్టు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధరించి.. జీవిత ఖైదు విధించింది. ఈ ఘటన అరుదైన కేసు పరిధిలోకి రాదని, మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని తెలిపింది.

## దిగొచ్చిన ఝార్ఖండ్ సర్కార్.. ముగ్గురు JPSC సభ్యులు రాజీనామా




ఝార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీ జరిగిందని ఆరోపిస్తూ నిరుద్యోగులు చేపట్టిన నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో ప్రభుత్వం దిగొచ్చింది. ఆరోపణలు వచ్చిన ఆ మూడు పరీక్షలు రద్దు చేస్తామని ప్రకటించింది.

ఆయా పరీక్షల్లో అవకతవకలపై సీఐడీ, ఈడీ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ క్రమంలోనే జేపీఎస్‌సీ ముగ్గురు సభ్యులు కూడా రాజీనామా చేశారు. వీరి రాజీనామాను గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆమోదించినట్లు లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీక్ ఆరోపణలతో ముగ్గురు పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులకు సీఐడీ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలోనే వారి పదవులకు రాజీనామా చేశారు. వీరిని సీఐడీ అధికారులు ఆగస్టు 10 నుంచి విచారించేదుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో 19 మందిని అరెస్టు చేసిన పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆందోళనల నేపథ్యంలో జులై 22న రాజీనామా చేసిన కమిషన్ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్టేను పోలీసులు ఇప్పటివరకు నాలుగు సార్లు విచారించారు. ఇదిలాఉంటే, ఆందోళనకారులతో చర్చలు జరిపిన ప్రభుత్వం.. వారి డిమాండ్లతో అనేక అంశాలపై సానుకూలంగా స్పందించింది. విచారణను సీబీఐకు అప్పగించాలన్న డిమాండ్‌పై స్పష్టత ఇవ్వకపోవడంతో నిరుద్యోగులు తమ ఆందోళనలు కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు.

## 12 ఏళ్ల బాలికపై అత్యాచారం.. ఎన్‌కౌంటర్‌లో నిందితుడు హతం



12 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో నిందితుడు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఉత్తర్‌ప్రదేశ్ లోని బులంద్‌షహర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు చోలా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫతేపూర్ జదౌన్‌కు చెందిన మోనుగా పోలీసులు గుర్తించారు.

అధికారుల వివరాల ప్రకారం.. స్థానిక గులాథీ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. వారిని ఆపేందుకు ప్రయత్నించగా విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. పోలీసులూ ఎదురుకాల్పులు జరపడంతో మోను తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న రెండో వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు.

గాయాలపాలైన మోనును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాల్పుల్లో ఎస్ఐ సందీప్ కుమార్, కానిస్టేబుల్ నరేంద్ర కుమార్ గాయపడ్డారు. ఆగస్టు 1న జరిగిన బాలిక అత్యాచారం, హత్య కేసులో మోను ప్రధాన నిందితుడు. ఇటీవల అతడి ఆచూకీ కోసం రూ.50 వేల రివార్డు ప్రకటించారు.

## స్వర్ణాంధ్ర కోసం సంకల్పం

మొదటి పేజీ తరువాయి

జీవో నెంబరు 3 సమస్యపై ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో రూ.250 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు.

**నైపుణ్య శిక్షణ, ఉద్యోగాలు**

గిరిజన యువత కోసం 1.5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు. ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు వారిని సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. 19 ఎంఓయూల ద్వారా 60 వేల మందికి లబ్ధి చేకూరుతుందని వివరించారు.

**స్వర్ణాంధ్ర లక్ష్యం**

ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గ్రీన్ పాస్‌పోర్ట్ ద్వారా పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సమాజం కోసం పనిచేయడమే నిజమైన దేశభక్తి అని పేర్కొన్నారు.

**ఉత్పత్తుల పరిశీలన**

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి మహిళలను అభినందించారు. గిరిజన ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రకాశం బ్యారేజ్ వద్ద గోదావరి జలాలను పరిశీలించిన సీఎం

మొదటి పేజీ తరువాయి

**విజయవాడ, ఆగష్టు 09**

ప్రకాశం బ్యారేజ్ లో గోదావరి నీటి పరవళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి వెళుతున్న సమయంలో బ్యారేజ్ పై తన వాహన కాన్వాయ్ నిలిపి, నిండు కుండలా ఉన్న బ్యారేజ్ ను తిలకించారు. గోదావరి నీటితో బ్యారేజ్ ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సీఎం అన్నారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్ లో ఇప్పటివరకు 17.52 టీఎంసీల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు.

**డెల్టా పంటలకు నీటి విడుదల**

పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నట్లు సీఎం తెలిపారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3,928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3,115 క్యూసెక్కులు, గుంటూరు చానల్ నుంచి 115 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**వర్షాభావంలో జీవధారగా పట్టిసీమ**

డెల్టా నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో పట్టిసీమ నీరు పంటలకు ఎంతో మేలు చేస్తుందని, రైతులకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**అధికారులకు సీఎం సూచనలు**

సమర్థవంతమైన నీటి నిర్వహణ ద్వారా వర్షాభావ పరిస్థితుల్లోనూ సాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు అన్ని విధాలా శ్రమించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల వల్ల గోదావరి నది నుంచి ఇప్పటివరకు 521 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు వెల్లడించారు.

## మెడికో ప్రియాంక మృతి..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: రాజమహేంద్రవరం ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతిచెందారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్లు వెల్లడించారు. కిమ్స్‌లో ఉన్న ప్రియాంక మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించనున్నారు. రాజమహేంద్రవరం పోలీసులు, ప్రియాంక తండ్రి వెంకటేశ్ వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

ప్రియాంక స్వస్థలం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఏక్లాస్‌పూర్. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆమె.. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో డెర్మటాలజీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రియాంక ఈ నెల 3న రాత్రి రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్యమాల్‌లో సినిమా చూసి, సహచర విద్యార్థి ఉమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు.

**మెడికో ప్రియాంక కేసులో కీలక ఆధారాలు సేకరించాం: ఎస్పీ**

రద్దీ కారణంగా వాహనాలు థియేటర్ గేటు వద్ద ఆగగా.. అదే సమయంలో నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆంద్రూ విలియం జోసెఫ్‌లు మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టారు. తరువాత మరో రెండుసార్లు బలంగా ఢీకొట్టి.. పైనుంచి కారు వెళ్లడంతో కిందపడిపోయిన ప్రియాంక తలకు తీవ్ర గాయమైంది. ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు.

**ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విచారం**

మెడికో ప్రియాంక మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంతో భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం కలచివేసిందన్నారు. నిర్లక్ష్యంతో కారు నడిపిన నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తామని చెప్పారు. ఈ మేరకు పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రియాంక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని సీఎం చెప్పారు.

## బాలినేని కూటమిలో ఉన్నారని మౌనంగా ఉన్నాం: దామచర్ల జనార్దన్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

తనపై బాలినేని విమర్శల నేపథ్యంలో దామచర్ల స్పందిస్తూ మీడియా సమావేశం నిర్వహించి కౌంటర్ ఇచ్చారు.

**'నేనే రాజు.. నేనే మంత్రి' అనే రీతిలో దామచర్ల.. మాజీ మంత్రి బాలినేని విమర్శలు**

"అమావాస్యకు ఓసారి బాలినేని ఒంగోలు వస్తారు. ఆయన కూటమిలో ఉన్నారని మౌనంగా ఉన్నాం. నాపై బాలినేని అనుచరుడు మురళి కరపత్రాలు వేశారు. ఆయనే కరపత్రాలు వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాలినేనిపై కరపత్రాలు ముద్రిస్తే పుస్తకాలు కూడా సరిపోవు. గత ప్రభుత్వంలో మాపై 79 కేసులు పెట్టించారు. బాలినేని పార్టీ మారారు కాబట్టి సరిపోయింది.. లేకుంటే తండ్రీకుమారులను లోపల వేసేవాళ్లం. గత ప్రభుత్వంలో చేసినట్లు రౌడీయిజం చేస్తామంటే కుదరదు. జనసేనను అడ్డుపెట్టుకుని వైకాపా నేతలకు పనిచేస్తున్నారు.

బార్ షాపులు సిండికేట్ చేసి తండ్రీకుమారులు రూ.కోట్లు వసూలు చేశారు. చేసిన అక్రమాలపై ప్రమాణం చేసేందుకు బాలినేని కాణిపాకం వస్తారా? నేను ఎలాంటివాడినో ప్రజలకు తెలుసు కనుకే 34వేల మెజారిటీ ఇచ్చారు. తలకిందులుగా తపస్సు చేసినా బాలినేనికి ఆ మెజారిటీ రాదు. ప్రభుత్వ భూముల్లో ఆయన వియ్యంకుడి విల్లాలున్నాయి. ఆ భూమిని వెంగముక్కలపాలెం ప్రజలకు కమ్యూనిటీ హాల్ కింద ఇస్తాం" అని దామచర్ల జనార్దన్ అన్నారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
సోమవారం ఆగస్ట్ 10, 2026

# యుసి బర్కిలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

**»పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, రాష్ట్ర రోడ్‌మ్యాప్‌పై బిగ్ డిస్కషన్!**



హైదరాబాద్ ఆగస్టు 9 జన తెలంగాణ
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ఒ క్లైమేట్ సెంటర్' (IECC) ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం మరియు సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల (SHG) భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక మరియు వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్కిలీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు... ఇరాన్‌పై దాడుల కోసమేనా.?



ఇజ్రాయెల్ (Israel)సైనికులకు ఉన్న అన్ని సెలవులను ఆ దేశ ఆర్మీ రద్దు చేసినట్లు (Cancels All Military Leaves) అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు వెంటనే తిరిగి సైన్యంలో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై కొత్త దాడులు ప్రారంభించనుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇరాన్‌పై మొదటిసారి దాడులు చేపట్టడానికి కొన్ని గంటల ముందు కూడా ఆ దేశం సైనికులకు ఇటువంటి ప్రకటనే చేసింది. దీంతో ఇప్పుడు కూడా పెద్ద స్థాయిలో దాడులు చేపట్టడానికి ఆ దేశ సైన్యం సిద్ధమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడుతుండడంతో దాడులను ఆపివేయాలని అమెరికా భావిస్తోంది. అయితే నెతన్యాహు (Netanyahu) మాత్రం యుద్ధం కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అమెరికా సాయం లేకుండా సొంతంగా టెహ్రాన్‌పై విరుచుకుపడడానికి (Strikes On Iran) సైన్యం సన్నాహాలు కూడా ప్రారంభించినట్లు తెలిపాయి. ఇరాన్‌లోని కీలక నేతలు, ఐఆర్‌జీసీ అధికారులే లక్ష్యంగా దాడులు చేయడానికి ఇప్పటికే నెతన్యాహు సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

**»ట్రంప్ శాంతి ప్రణాళికలను వ్యతిరేకించిన నెతన్యాహు..**

ఇరాన్‌తో యుద్ధం ముగింపు, గాజాలో దాడుల నిలుపుదల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (Donald Trump) ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళికను నెతన్యాహు వ్యతిరేకించారు. గాజా విషయంలో అగ్రరాజ్య ప్రతిపాదనలను అంగీకరించబోమని.. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టేంతవరకు వెనక్కి తగ్గబోమని ప్రకటించారు.

**»దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్**

ఇజ్రాయెల్ మరోసారి తమపై దాడి చేస్తే.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ శనివారం హెచ్చరించింది. టెల్ అవీవ్‌లోని చమురు రిఫైనరీలు, కీలక కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని పేర్కొంది. వ్యూహాత్మక హర్మూజ్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాకు సూచించింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

# లేజర్ లైట్లతో పైలట్ తడబాటు.. గాల్లోనే చక్కర్లు కొట్టిన విమానం



విమానం ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో పైలట్‌ను లేజర్ లైట్లు ఇబ్బందులకు గురిచేశాయి. దీంతో విమానాన్ని కిందికి దించకుండా అలాగే గాల్లో చక్కర్లు కొట్టించారు. రెండో ప్రయత్నంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. కోల్‌కతా అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. విమానాశ్రయ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. మలేషియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం 159 మంది ప్రయాణికులతో కౌలాలంపుర్ నుంచి కోల్‌కతాకు వస్తోంది. గమ్యస్థానం సమీపించడంతో పైలట్లు ల్యాండింగ్‌కు సిద్ధమయ్యారు. అయితే, రన్‌వేకు ఎనిమిది నాటికల్ మైళ్ల (దాదాపు 15 కి.మీ.) దూరంలో ఉన్నప్పుడు మధ్యమ్‌గ్రామ్-బరసాత్ వైపు నుంచి విమానం కాక్‌పిట్ దిశగా అకస్మాత్తుగా ప్రకాశవంతమైన లేజర్ కాంతులు వచ్చాయి. అనుకోని పరిణామంతో తడబడిన పైలట్.. విమానాన్ని అలాగే గాల్లో చక్కర్లు కొట్టించి, కాసేపటికి సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విమానయాన సంస్థ ఈ విషయాన్ని ఎయిర్‌పోర్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కోల్‌కతా విమానాశ్రయ డైరెక్టర్ విక్రమ్ సింగ్ తెలిపారు.

# అమెరికా వైఖరి మార్చుకోవాల్సిందే.. ఇరాన్ కొత్త షరతులు



హర్మూజ్ జలసంధి (Strait of Hormuz)ని తిరిగి తెరిచేందుకు ఇరాన్ (Iran) కొత్త షరతులు విధించింది. అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని స్పష్టం చేసింది. ఈ వ్యూహాత్మక ప్రాంతం నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. తమ ఆస్తులపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు, విదేశాల్లో స్తంభింపజేసిన నిధులను బేషరతుగా విడుదల చేయాలని కోరింది. ఇరాన్ నౌకాశ్రయాలపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ (Abbas Araghchi), సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మహ్మద్ బాగెర్ జోల్ఘాదర్ ఈ వివరాలు వెల్లడించారు. జూన్‌లో తాత్కాలిక ఒప్పందంలో హర్మూజ్ జలసంధి విషయంలో కొన్ని అంశాలపై అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. ఆంక్షల సడలింపు, స్తంభించిన ఆస్తుల విడుదల వంటి అంశాలను తుది ఒప్పందంలో చేర్చాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు ఇరాన్ వైఖరి మారింది. జలసంధిని తెరవాలంటే ఆంక్షల ఎత్తివేత, స్తంభించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతోంది. అమెరికా మాత్రం జలసంధిపై ముందుగా ఒప్పందం కుదరాలని భావిస్తోంది. ఆ తర్వాతే దిగ్బంధనాన్ని ముగించే అంశాన్ని పరిశీలించాలని చూస్తోంది. ఇరాన్ తాజా డిమాండ్లపై అమెరికా ఇంకా స్పందించలేదు. ఒమన్(రాఘిఅ)తో తాము జరుపుతున్న చర్చలు కేవలం నౌకల రాకపోకల సాంకేతిక మార్గాల కోసమేనని.. అమెరికా తమ షరతులు అంగీకరించే వరకు జలసంధి తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది.

# సౌదీ అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి



సౌదీ అరేబియాలోని జజాన్‌లో ఉన్న అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. ఈ దాడికి తామే కారణమని హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యహ్యా సరీ (yahya saree) తెలిపారు. తమ గగనతలంలో సౌదీ డ్రోన్ల చొరబాటుకు ప్రతిస్పందనగానే దాడి చేసినట్లు వెల్లడించారు. సౌదీ "మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ" కూడా ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగినట్లు ధ్రువీకరించింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. ఓ వైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ దాడి ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే దేశాలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' (mecca joint defence agreement) పై సంతకాలు చేశాయి. మూడు దేశాల్లో ఏదైనా ఒకదానిపై సాయుధ దాడి జరిగితే.. మూడింటిపై జరిగిన దాడిగానే పరిగణించేలా ఒప్పందంలో పేర్కొన్నారు. ప్రాంతీయ భద్రతపై ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అడవితో అనుబంధం.. అభివృద్ధిలో అగ్రస్థానం

**»గిరిజన ఆదివాసి బిడ్డలకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం**

**»గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్ల కేటాయింపు**

**»అడవిని కాపాడుకుంటూనే గిరిజన సమాజం అభివృద్ధి చెందాలి**

**»గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

హైదరాబాద్, ఆగస్టు 9: జన తెలంగాణ
అడవితో అనుబంధాన్ని, తమ మూలాలను కాపాడుకుంటూనే గిరిజన సమాజం అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు ఆకాంక్షించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గిరిజన బిడ్డలు దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**»గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్లు**

2026--27 ఆర్థిక సంవత్సరానికి ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులను గిరిజన ప్రాంతాల్లో విద్య, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగు--భూమి అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి తదితర రంగాలకు వినియోగిస్తున్నామని చెప్పారు. "ఒక గిరిజన గ్రామానికి రోడ్డు రావాలి.. ఒక ఇంటికి మంచినీరు అందాలి.. ఒక విద్యార్థికి మంచి విద్య లభించాలి.. ఒక యువకుడికి నైపుణ్యం రావాలి.. ఒక మహిళకు ఆదాయం సమకూరాలి.. ఒక రైతు భూమిలో పంట పండాలి. అప్పుడే బడ్జెట్‌కు నిజమైన అర్థం ఉంటుంది" అని మంత్రి పేర్కొన్నారు.

**ఏజెన్సీ ప్రాంతాల్లో దూరం అనే మాట ఉండకూడదు**

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం ప్రతి గిరిజన కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి అంటే నగరాల్లో పెద్ద భవనాలు నిర్మించడం మాత్రమే కాదని.. మారుమూల గిరిజన తండాలో ఒక కుటుంబం జీవితం సులభతరం చేయడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు.

**భూమికి నీరు.. రైతుకు పంట.. కుటుంబానికి ఆదాయం**

ఇందిరా గిరి జల వికాసం ద్వారా గిరిజన రైతుల భూములకు నీటి వసతి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌరశక్తి, సోలార్ పంపుల వినియోగాన్ని పెంచడంతో పాటు తోటలు, ప్రత్యామ్నాయ పంటలు, భూమి ఉత్పాదకత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అడవి.. ఆదివాసీకి తల్లి లాంటిది**

ఆదివాసీకి అడవి కేవలం ప్రకృతి సంపద కాదని.. అది జీవనాధారం, సంస్కృతికి మూలం, భవిష్యత్తుకు భరోసా అని మంత్రి అన్నారు. అడవి అన్నం, ఔషధం, ఉపాధి, నీడ అందించిందని తెలిపారు. "ఆదివాసీ--అడవి బంధం చెట్టు--మనిషి సంబంధం కాదు.. తల్లి--బిడ్డ అనుబంధం" అని పేర్కొన్నారు. అడవిని కాపాడుకుంటూనే అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

**అడవి నుంచి ఐఐటీ వరకు.. గిరిజన బిడ్డల విజయ ప్రస్థానం**

గిరిజన గురుకులాల్లోని 166 విద్యాసంస్థల్లో 83 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని మంత్రి తెలిపారు. 2025--26లో పదో తరగతిలో 98 శాతానికి పైగా, ఇంటర్మీడియట్‌లో 86 శాతానికి పైగా, డిగ్రీలో 89 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. 28 మంది ఐఐటీల్లో, 23 మంది ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందగా, 167 మంది నీట్‌లో అర్హత సాధించడం గిరిజన విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. అవకాశాలు కల్పిస్తే గిరిజన బిడ్డలు ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లగలరని అన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో రాణించేలా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.

**పుస్తకంతో పాటు.. ఏఐ విద్య**

ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఉద్యోగ అవకాశాలపై గిరిజన విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఆధారిత ఎస్టీఈఎం ల్యాబ్‌లు, డిజిటల్ లెర్నింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. గిరిజన బిడ్డలు డాక్టర్, ఇంజినీర్, శాస్త్రవేత్త, అధికారి, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి గిరిజన యువత ఎదగాలని పిలుపునిచ్చారు.

**అటవీ ఉత్పత్తులకు విలువ జోడించాలి**

తేనె, చింతపండు, ఔషధ మొక్కలు తదితర అటవీ ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా గిరిజనులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
ముడి ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించకుండా ప్రాసెసింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ ద్వారా గిరిజన యువత, మహిళా సంఘాలు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**»గిరిజన మహిళ ఆర్థికంగా బలపడాలి**

గిరిజన మహిళ కుటుంబం, వ్యవసాయం, అడవిపై ఆధారపడి నిరంతరం శ్రమిస్తోందని మంత్రి అన్నారు. ఆమె శ్రమకు తగిన విలువ, ఆదాయం లభించేలా నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.
"మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుంది.. కుటుంబం బలపడితే గిరిజన సమాజం బలపడుతుంది" అని పేర్కొన్నారు.

**పీఎం-జన్మన్ అమలులో తెలంగాణకు మూడో స్థానం**

ప్రత్యేకంగా వెనుకబడిన గిరిజన కుటుంబాల సమగ్ర అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పీఎం-జన్మన్ కార్యక్రమంలో తెలంగాణ దేశంలో మూడో ఉత్తమ రాష్ట్రంగా నిలవడం గర్వకారణమని మంత్రి తెలిపారు. ఇళ్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు ప్రతి అర్హమైన గిరిజన కుటుంబానికి అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ర్యాంకుల కంటే ఒక గిరిజన తల్లి "నా ఇంటికి నీళ్లు వచ్చాయి" అని చెప్పడం, ఒక రైతు "నా భూమికి నీరు వచ్చింది" అని చెప్పడం, ఒక విద్యార్థి "నాకు మంచి చదువు దొరికింది" అని చెప్పడమే ప్రభుత్వానికి అసలైన అవార్డు అని అన్నారు.

**మన భాష.. మన చరిత్ర.. మన సంస్కృతి**

గిరిజన భాషలు కేవలం సంభాషణకు మాత్రమే పరిమితం కావని.. తరతరాలుగా వచ్చిన అటవీ జ్ఞానం, ఔషధ పరిజ్ఞానం, జీవన విధానం, చరిత్ర, సంస్కృతి వాటిలో నిక్షిప్తమై ఉన్నాయని మంత్రి అడ్లూరి తెలిపారు. గిరిజన భాషలు, జానపద కళలు, పాటలు, నృత్యాలు, సంప్రదాయ జ్ఞానాన్ని భావితరాలకు అందించేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. "ఇంగ్లిష్ నేర్చుకోవాలి.. తెలుగు నేర్చుకోవాలి.. ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి.. కానీ మన ఇంట్లో అమ్మమ్మ మాట్లాడే భాషను మాత్రం మర్చిపోవద్దు" అని గిరిజన విద్యార్థులకు సూచించారు.

**రాంజీ గోండ్ త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి**

గిరిజన ఆదివాసీల వీరుల చరిత్రను పుస్తకాలకే పరిమితం చేయకుండా భావితరాలకు తెలియజేయాలని మంత్రి అన్నారు. రాంజీ గోండ్ వంటి వీరుల త్యాగాలను ప్రతి గిరిజన విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న రాంజీ గోండ్ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం భవిష్యత్ తరాలకు గిరిజన చరిత్ర, పోరాట స్ఫూర్తిని పరిచయం చేసే కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు.

**»ఇందిరాగాంధీ గిరిజన సంక్షేమానికి బలమైన పునాది**

మాజీ ప్రధాని దివంగత శ్రీమతి ఇందిరాగాంధీ గిరిజనుల హక్కులు, గౌరవం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. గిరిజనుల రాజ్యాంగపరమైన రక్షణలు, రిజర్వేషన్లు, ప్రత్యేక అభివృద్ధి విధానాలకు బలమైన పునాది ఏర్పడిందన్నారు. అటవీ హక్కుల చట్టం గిరిజనుల భూమి, అటవీ హక్కులకు చారిత్రక గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాగితాలకే పరిమితం చేయకుండా కార్యరూపంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందన్నారు.

**»ప్రభుత్వంతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి**

గిరిజన సమాజ అభివృద్ధిలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని మంత్రి పిలుపునిచ్చారు. పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, మద్యపానం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.
యువత నైపుణ్యాలు నేర్చుకోవాలని, మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని, అడవిని కాపాడాలని, చెట్లను పెంచాలని సూచించారు.
కొత్త ఆదివాసీ తెలంగాణ నిర్మాణమే లక్ష్యం ప్రతి గిరిజన గ్రామంలో రహదారి, విద్యుత్, మంచినీరు, మంచి పాఠశాల, ఆరోగ్య సదుపాయం, ఇంటర్నెట్, యువతకు నైపుణ్య కేంద్రం, మహిళలకు ఉపాధి, రైతులకు సాగునీరు అందుబాటులో ఉండాలని మంత్రి అన్నారు.
అదే సమయంలో మన పాట, మన నృత్యం, మన భాష, మన పండుగ, మన అడవి, మన గౌరవం కూడా నిలిచి ఉండాలని ఆకాంక్షించారు. "మన అడవిని కాపాడుదాం.. మన భూమిని కాపాడుదాం.. మన భాషను, మన సంస్కృతిని, మన హక్కులను కాపాడుదాం. అన్నింటికంటే ముఖ్యంగా మన పిల్లల భవిష్యత్తును కాపాడుదాం" అని పిలుపునిచ్చారు.
"అడవిని కాపాడుదాం--ఆదివాసీని బలపరుదాం.. ఆదివాసీని బలపరుదాం--తెలంగాణను బలపరుదాం" అని మంత్రి అన్నారు.

-------------

అధికారులు ,ఇతర ప్రజా ప్రతినిధుల ప్రసంగాలు
గిరిజన హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం
గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బి.ఎం., ఐఏఎస్ మాట్లాడుతూ.. గిరిజనుల అటవీ హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి, ఆరోగ్యం, మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి, సంస్కృతి--సంప్రదాయాల పరిరక్షణకు శాఖ ప్రాధాన్యం ఇస్తోందన్నారు.
గిరిజనుల సాంప్రదాయ జ్ఞానం, జీవన విధానం, కళలు, భాషలు, ఆచారాలను భావితరాలకు అందించేందుకు టీఆర్ఐ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**»గిరిజనులకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలి**

మాజీ ఎంపీ శ్రీ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ.. మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లాలో గిరిజన జనాభా ప్రాతిపదికన కనీసం ఒక శాసనసభ స్థానం కల్పించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్..మాట్లాడుతూ.. మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ హయాంలో లంబాడీలకు కల్పించిన రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు తదితర రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించారని తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ...గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు గిరిజనేతరుల అక్రమ ప్రవేశం, భూముల ఆక్రమణ వంటి అంశాలపై కఠిన నియంత్రణ అవసరమన్నారు. మాజీ ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ. గిరిజన సమాజం తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న సంప్రదాయాలు, , కళలు, భాషలు, జీవన

# నాడు పోలీసు అమరుల త్యాగాలే నేటి శాంతికి పునాది: డీజీపీ సి.వి. ఆనంద్

**»-వరంగల్‌లో అమరుల కుటుంబాలతో భేటీ.. 'టీజీ-వీర్' యాప్ ప్రారంభం**

హైదరాబాద్ ఆగస్టు 9: జన తెలంగాణ

పోలీసు అమరుల త్యాగాల ఫలితంగానే నేడు రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్నాయని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్లతో పోరాడుతూ అమరులైన 28 మంది పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో ఆయన ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'టీజీ-వీర్' గ్రీవెన్స్ పోర్టల్‌ను డీజీపీ ప్రారంభించారు. ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, కారుణ్య నియామకాలు, స్థలాల కేటాయింపు, సంక్షేమ పథకాల వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదికపై నమోదు చేసుకునేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. అమరుల సేవా వివరాలు, కుటుంబ సమాచారం, ఇప్పటివరకు పొందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు కూడా ఇందులో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాష్ట్ర, యూనిట్ స్థాయిలో అధికారులు ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించే అవకాశం కల్పించారు. అమరుల కుటుంబాలకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక ఫ్యామిలీ కార్డులను డీజీపీ అందజేశారు. ఆ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నేరుగా టీజీ-వీర్ పోర్టల్‌కు చేరుకునేలా ఏర్పాటు చేశారు. ఈ పోర్టల్‌ను రూపొందించిన ఎస్ఐబీ అధికారులను అభినందించిన ఆయన, రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి అమరుల కుటుంబాల సమస్యలను సేకరించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అమరుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్, పెన్షన్, ఇతర సంక్షేమ అంశాలకు సంబంధించిన ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకొచ్చాయి. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే వాటి పరిష్కారాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని వరంగల్ పోలీసు కమిషనర్‌కు సూచించారు. తన ఉద్యోగ జీవితాన్ని వరంగల్‌లోనే ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకున్న డీజీపీ, నక్సలైట్ల ప్రభావం తీవ్రంగా ఉన్న రోజుల్లో పోలీసు సిబ్బంది ఎన్నో ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. అప్పటి త్యాగాల వల్లే నేడు ఈ ప్రాంతంలో శాంతియుత వాతావరణం నెలకొన్నదని పేర్కొన్నారు. అనంతరం డీజీపీ నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీసు కమిషనరేట్ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పురోగతిని కమిషనర్ వివరించారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందేలా, ఆధునిక సాంకేతికత, నిఘా వ్యవస్థలకు అనుకూలంగా భవనాన్ని తీర్చిదిద్దాలని డీజీపీ సూచించారు. వినియోగంలో లేని పాత భవనాలను తొలగించి, కార్యాలయానికి వెళ్లే అంతర్గత రహదారులను మెరుగుపరచాలని ఆదేశించారు.

# ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం

**»సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**»బిజెపి పాలనకు వ్యతిరేకంగా వరంగల్ లో సిపిఐ పాదయాత్ర ప్రారంభం**

హైదరాబాద్ ఆగస్టు 9 జన తెలంగాణ

ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం అని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని, బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ పాదయాత్ర చేపట్టిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సిపిఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ నుండి ప్రారంభమైన సిపిఐ పాదయాత్రను రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పాదయాత్ర ఎల్బీ నగర్,గొర్రెకుంట, ధర్మారం మీదుగా గీసుకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వంతపాడుతూ దేశ సంపదను వారికి దోచి పెడుతున్నదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి ఉద్యోగులను రోడ్డు పైకి నెట్టిందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. చివరకు పోటీ పరీక్షల పేపర్ లను లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిందని, పరీక్షా పేపర్ ల లీకేజీ పై ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయక తప్పలేదని అన్నారు. సామాన్య ప్రజలపై ధరల భారాలు మోపిందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని అన్నారు. రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. మోదీ పాలనలో పెరుగుతున్న నియంతృత్వ ధోరణులలో భాగంగా రాజకీయ వ్యతిరేకులను అణచివేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలను క్రమంగా నిర్వీర్యం చేయడం జరుగుతున్నాయన్నారు. వీటి పై దేశ వ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నదని అన్నారు. ఆగస్టు 6 నుండి ప్రారంభమైన ఈ దేశవ్యాప్త పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కానుందని తెలిపారు. సిపిఐ పోరు యాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్,సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, సీనియర్ నాయకులు టి. వెంకట్రాములు,జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, అక్కపెల్లి రమేష్,కందిక చెన్న కేశవులు, సంగి ఎలేందర్,గుండె బద్రి,వీరగోని శంకరయ్య, తాళ్లపల్లి రహేలా, ఓర్సు రాజు, ఎండి.అక్బర్, పి. రమేశ్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**»బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాశీచందర్ రావు**

హైదరాబాద్ ఆగస్టు 9 జన తెలంగాణ

**తన 'ఛ్చాత్రోం కీ గూంజ్' ప్రోగ్రామ్‌తో రాహుల్ గాంధీ హైదరాబాద్‌కి ఎప్పుడు వస్తున్నారు?**

రాహుల్ గాంధీ దేశమంతటా .. ముఖ్యంగా ఎన్డీయే (బీజూూ) పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో తిరుగుతూ, 'ఛ్చాత్రోం కీ గూంజ్' (విద్యార్థుల గళం) అనే ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు, యూత్ కి తానే పెద్దదిక్కులా మాట్లాడేస్తున్నారు. మరి 56 ఏళ్ల ఈ స్వయంప్రకటిత యూత్ లీడర్, తెలంగాణకు వచ్చి తన సొంత కాంగ్రెస్ ప్రభుత్వంలో నలిగిపోతున్న విద్యార్థుల బాధలను ఎప్పుడు వింటారు?

కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల, తెలంగాణలో దాదాపు 20 లక్షల మంది SC, ST, BC, EBC విద్యార్థుల ఫ్యూచర్ ప్రమాదంలో పడిందనీ ధ్వజమెత్తారు ఫీజులు కడితేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీల వాళ్లు తెగేసి చెబుతున్నారు. దాంతో వేలాది మంది స్టూడెంట్స్ పైచదువులకి వెళ్లలేక, ఉద్యోగాల్లో చేరలేక నానా తిప్పలు పడుతున్నారు. ఈ సంగతి రాహుల్ గాంధీకి తెలియదా? లేక కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విద్యార్థుల సమస్యలు ఆయనకు పట్టవా? ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలపై తెలంగాణ హైకోర్టు కూడా ప్రభుత్వాన్ని పలుమార్లు ప్రశ్నించింది. 2020-21 విద్యాసంవత్సరం నుంచీ ఫీజులు రావాల్సి ఉందని, ఆ బకాయిలు దాదాపు ?10,000 కోట్ల నుంచి ?12,000 కోట్ల వరకు ఉన్నాయని కాలేజీ యజమాన్యాలు కోర్టుకు చెప్పాయి. దీనివల్ల పరిస్థితి చాలా ఘోరంగా తయారైంది. కోర్సులు పూర్తయినా చేతికి సర్టిఫికెట్లు రాక ఉద్యోగాలు, ఉన్నత చదువులు, విదేశీ అవకాశాలు కోల్పోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజులు క్లియర్ చేయకపోవడం వల్ల విద్యార్థుల కెరీర్ పాడైపోవడమే కాకుండా, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయి.

**రాహుల్ గాంధీ బయట 'ఛ్చాత్రోం కీ గూంజ్' అని గొప్పలు చెబుతున్నారు సరే, కానీ హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణ విద్యార్థుల నిజమైన ఆవేదనను వింటారా?**

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉంటూ మాటల ప్రచారానికే పరిమితమైన రాహుల్ గాంధీ, కనీసం ఒక్కసారైనా తెలంగాణ వైపు చూస్తారా? 2023 ఎన్నికల టైమ్‌లో ఆయన అశోక్ నగర్‌కి వచ్చి 100 రోజుల్లో జాబ్ క్యాలెండర్, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని అబద్ధపు హామీలిచ్చారు. రెండేళ్లన్నర గడిచినా ఆ మాటలు ఒక్కటి కూడా నెరవేరలేదు.

రాహుల్ గాంధీకి నిజంగానే విద్యార్థులపై ప్రేముంటే, అదే అశోక్ నగర్‌లో ఈ 'ఛ్చాత్రోం కీ గూంజ్' ప్రోగ్రామ్ పెట్టి, ఆయన హామీలిచ్చిన యువతను నేరుగా ఎదుర్కోవాలని సవాల్ చేస్తున్నాను.

# బోనాల వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

**»దేవాదాయ మంత్రి, పీసీసీ అధ్యక్షుడు, ఎంపీతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**»పలు ఆలయాల్లో దర్శనం.. బోనం, పట్టు వస్త్రాల సమర్పణ.. భక్తులతో కలిసి నృత్యం**

హైదరాబాద్, ఆగస్టు 9: జన తెలంగాణ

బోనాల జాతర అంటే భక్తి.. బోనాల జాతర అంటే తెలంగాణ సంస్కృతి.. బోనాల జాతర అంటే ఉత్సాహం. అలాంటి పండుగ వాతావరణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తనదైన శైలిలో సందడి చేశారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులతో మమేకమై ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మిరాలంమండి మహంకాళేశ్వర ఆలయం వద్ద భక్తులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని పలు ప్రముఖ అమ్మవారి ఆలయాలను సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిరాలంమండి శ్రీశ్రీ మహంకాళేశ్వర ఆలయం వద్ద భక్తులతో కలిసి నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి పొన్నం ప్రభాకర్ గౌలీపుర దర్వాజా శ్రీశ్రీశ్రీ మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం, శ్రీ కోట మైసమ్మ దేవాలయం, అక్కన్న మాదన్న శ్రీ మహంకాళి ఆలయాలను సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**»మిరాలంమండిలో ప్రత్యేక ఆకర్షణగా పొన్నం**

మిరాలంమండి శ్రీశ్రీ మహంకాళేశ్వర ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రభుత్వం తరపున బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు.

పూజల అనంతరం భక్తుల మధ్య జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి.. కళాకారుల నృత్య ప్రదర్శనలకు స్పందిస్తూ స్వయంగా నృత్యంలో పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన నృత్యం చేయడంతో బోనాల ప్రాంగణంలో సందడి నెలకొంది. భక్తులు ఉత్సాహంగా స్పందిస్తూ మంత్రితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

**»రేణుకా ఎల్లమ్మ, సింహవాహిని అమ్మవార్లకు పట్టు వస్త్రాలు**

గౌలీపురా లలిత్‌బాగ్ రోడ్డులోని పటేల్ నగర్ శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలోనూ పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. పలు ఆలయాల్లో భక్తులతో మాట్లాడిన మంత్రి.. ఉత్సవాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

**»తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు**

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, ప్రజల జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని, భద్రత, పారిశుద్ధ్యానికి సంబంధించిన సూచనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

**»భక్తులతో మమేకమైన మంత్రి**

బోనాల వేడుకల్లో పొన్నం ప్రభాకర్ భక్తులతో కలిసిపోయి ఉత్సవాన్ని ఆస్వాదించారు. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు, బోనం, పట్టు వస్త్రాల సమర్పణతో పాటు భక్తులతో కలిసి నృత్యంలో పాల్గొనడం ద్వారా పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. దీంతో హైదరాబాద్‌లోని పలు బోనాల వేడుకల్లో మంత్రి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ ఆగస్టు 9 జన తెలంగాణ

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ అమ్మవారికి బోనం ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బోనాల ఉత్సవాలు సమాజంలో ఐక్యత, సామరస్యం, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని, తెలంగాణ సంస్కృతి పరిరక్షణలో ఈ ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు కార్పొరేటర్లు మాసం గణేష్ చొప్పరి జయశ్రీ సొగాని కొమరయ్య నలువాల రవీందర్ పొన్నం లక్ష్మీ మొండయ్య ఇతర ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 4.2. కేజీల గంజాయి చాక్లెట్లు పట్టివేత..

హైదరాబాద్ ఆగస్టు 9 జన తెలంగాణ

నానక్ రామ్ గూడ శేర్లింగంపల్లి 2-58/2/3/8 ఇంట్లో అజయ్ సింగ్ అనే వ్యక్తి గంజాయి చాక్లెట్లు అమ్ముతుండగా ఎస్ టి ఎఫ్ సీ టీం ఎస్సై మంజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. నిందితుడు అజయ్ సింగ్ ను గంజాయి చాక్లెట్లను కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

# మైలర్ దేవ్ పల్లి డివిజన్ లో ఘనంగా బోనాల వేడుకలు -

**పలు అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**


రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 9 జన తెలంగాణ

తెలంగాణ రాష్ట్ర విశిష్ట పండుగ అయిన ఆషాడ బోనాల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం, మైలర్ దేవ్ పల్లి డివిజన్ లోని, కాటేదాన్, బుద్వేలు, మదుబన్ కాలనీ, పద్మ సాలిపురం,పరిధిలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ గారు ఈరోజు మైలర్ దేవ్ పల్లి పరిధిలోని పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించారు. ఈ ఉదయం వివిధ దేవాలయాలకు విచ్చేసిన ఆయన, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## భారత్ సహా 5 దేశాలపై 100% టారిఫ్!

**బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం**


వాషింగ్టన్, దిల్లీ: రష్యాను, ఆ దేశం నుంచి పెట్రోలియం ఉత్పత్తుల్ని కొంటున్న దేశాలను శిక్షించడానికి ఉద్దేశించిన బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోదం తెలిపింది. రష్యా నుంచి భారత్, చైనా వంటి దేశాలు ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నందువల్ల పరోక్షంగా ఉక్రెయిన్‌పై యుద్ధానికి అవి సాయపడుతున్నట్లేనని భావిస్తూ ఈ బిల్లును ప్రవేశపెట్టింది. రష్యా నుంచి చమురు, గ్యాస్



దిగుమతి చేసుకుంటున్న అగ్ర శ్రేణి ఐదు దేశాలపై 100% టారిఫ్‌ల బాదుడుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇది అధికారమిస్తుంది. చైనా, భారత్, అజర్‌బైజాన్, హంగరీ, స్లొవేకియాలు ఈ ఐదు దేశాలు. ఇరాన్ ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలపై ఆంక్షలు విధించే చట్టాన్ని పొడిగించడం తాజా బిల్లు ఉద్దేశాల్లో ఒకటి. దీనిపై ప్రతినిధుల సభ ఈ నెల 31న నిర్ణయం తీసుకుంటుంది.

## కెనడాలో భారత యువతి హత్య.. 7 నెలల తర్వాత నిందితుడి అరెస్టు

కెనడాలో భారత యువతి హత్య చేసిన కేసులో పోలీసులు నిందితుడిని ఏడు నెలల తర్వాత అరెస్టు చేశారు. 30 ఏళ్ల హిమాన్షీ ఖురానా గత డిసెంబరులో టొరంటోలోని ఓ నివాసంలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందారు. ఆమె



మృతిని హత్యగా తేల్చిన పోలీసులు.. ఆమె అబ్దుల్ గఫూరీ (32)తో సన్నిహిత సంబంధంలో ఉన్నట్లు గుర్తించారు. హత్య తర్వాత గఫూరీ దేశం విడిచి పరారయ్యాడు. ఈ క్రమంలో టొరంటో (Toronto) పోలీసులు అంతర్జాతీయ ఏజెన్సీలతో కలిసి అతడిని పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. కెనడా వ్యాప్తంగా అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం అతడిని కెనడాకు రప్పించి టొరంటో ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టు చేశారు. ఫస్ట్ డిగ్రీ (ముందస్తు ప్రణాళికతో హత్య) అభియోగం నమోదు చేశారు. హిమాన్షీ మృతిపై టొరంటోలోని భారత రాయబార కార్యాలయం గతంలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆమె కుటుంబానికి అధికారులతో కలిసి అన్ని విధాలా సహకరిస్తామని ప్రకటించింది.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
సోమవారం ఆగస్ట్ 10, 2026

# ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సమర్థవంత అమలు
- గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యకు ప్రాధాన్యం
- రూ.198 కోట్లతో 74 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం







**ఒంగోలు, ఆగస్టు 9 :**
ఆదివాసీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఒంగోలు నగరంలోని గిరిజన భవనంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఇన్చార్జి డిఆర్ఓ మాధురి, విభిన్నమైన శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా అల్లూరి సీతారామరాజు, ఇతర గిరిజన వీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సమర్థంగా అమలు చేస్తున్నామని, ఎస్టీలకు కేటాయించిన నిధులే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని, ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం కింద గిరిజనులకు 4.55 లక్షల ఎకరాలు కేటాయించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 4152 అత్యంత వెనుకబడిన గిరిజన ఆవాసాలకు (పి.వి.టి.జీ.లు) 11 సంక్షేమ పథకాలను విస్తరింప చేశామన్నారు. గిరిజనుల విద్యకు ప్రత్యేక దృష్టి సారించి ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, రూ.198 కోట్లతో 74 గిరిజన పాఠశాలల్లో అదనపు భవనాలు నిర్మించామని వివరించారు. సికిల్ సెల్ ఎనీమియా బారినపడిన గిరిజనులకు నెలకు పదివేల రూపాయలు చొప్పున పింఛను అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది విశాఖలో యోగాసనాలు, ఇటీవల భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా 13,000 మంది గిరిజనుల థింసా నృత్యాలు గిన్నిస్ రికార్డు సాధించాయని చెప్పారు. గిరిజనుల అభివృద్ధికి, వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు.
ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ, గిరిజనులకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్నామని చెప్పారు. 2014-19 సమయంలో ఒంగోలులో రూ.1.35 కోట్లతో గిరిజన భవనాన్ని తానే నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ భవనంలో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని, నగరంలో గిరిజన బాలికలకు ప్రత్యేక హాస్టల్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో గిరిజనులకు సముచిత అవకాశం కల్పిస్తామని తెలిపారు.
వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందిన 16 మందికి నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కురిచేడు మండలం రామాంజనేయ కాలనీలో ఇళ్లు కాలిపోయిన మూడు కుటుంబాలకు సరుకులను, వర్షాలకు ఇల్లు కారుతున్న 25 కుటుంబాలకు టార్పాలిన్ పట్టాలను అందించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు డాక్టర్ బాలాజీ నాయక్, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యం, పొట్లూరి లక్ష్మయ్య, సైదా నాయక్, తదితరులు పాల్గొన్నారు. వేడుకలలో గిరిజన విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# దేశ భద్రత, జాతీయ సమగ్రతకు ఎఫ్‌సిఆర్ఏ సవరణలు శుభపరిణామం

- విదేశీ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపు
- దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా నిధులు వాడితే కఠిన చర్యలు
- చట్టబద్ధ సంస్థలకు ఇబ్బంది లేకుండా విదేశీ నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట



**మార్కాపురం , ఆగస్టు 9**
దేశ భద్రత, జాతీయ సమగ్రత, పారదర్శక పరిపాలనకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్ఏ)లో సవరణలు చేపట్టడం శుభ పరిణామమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. విదేశాల నుంచి వచ్చే నిధులు దేశ అభివృద్ధి, విద్య, వైద్యం, పేదల సంక్షేమం, సేవా కార్యక్రమాలకు వినియోగించబడటం స్వాగతించదగ్గ విషయమన్నారు. ఆ నిధులను దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వినియోగించే ప్రయత్నాలను మాత్రం అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విదేశీ నిధుల వినియోగంలో మరింత పారదర్శకత తీసుకురావడం, ఆర్థిక లావాదేవీలపై ఖచ్చితమైన పర్యవేక్షణ ఏర్పాటు చేయడం, నిధులు ఏ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారనే అంశంపై జవాబుదారీతనాన్ని పెంచడం ఎఫ్‌సిఆర్ఏ సవరణల ప్రధాన లక్ష్యాల్లో భాగమని పేర్కొన్నారు.
దేశ వ్యతిరేక కార్యకలాపాలు, ఉగ్రవాద అనుబంధ కార్యకలాపాలు, సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలు, తప్పుడు సమాచార వ్యాప్తి, బలవంతపు మతమార్పిడులు వంటి వాటికి విదేశీ నిధులు దుర్వినియోగం కాకుండా కఠినమైన పర్యవేక్షణ అవసరమన్నారు. చట్టబద్ధంగా, ప్రజా సంక్షేమం కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, విదేశీ నిధుల దుర్వినియోగాన్ని మాత్రమే నిరోధించడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. విదేశీ నిధులను స్వీకరించే సంస్థలు తమ ఆదాయం, వ్యయాల వివరాలను మరింత పారదర్శకంగా నిర్వహించేలా నిబంధనలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే వ్యవస్థ మరింత సమర్థవంతంగా ఉండాలని పేర్కొన్నారు.
దేశ సార్వభౌమాధికారం, భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నదే మోదీ ప్రభుత్వ విధానమని ఏలూరి అన్నారు. విదేశీ నిధులు దేశాభివృద్ధికి ఉపయోగపడేలా ప్రోత్సహిస్తూ, వాటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడం ద్వారా బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. విదేశీ నిధులు దేశ ప్రయోజనాలకు ఉపయోగపడాలని, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉపయోగిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని కేంద్రం స్పష్టం చేసిన విషయాన్ని ఉటంకించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్, బిఎల్ఎ-1 ఆకుల నగేష్, బీజేపీ నాయకులు ముప్పూరి శ్రీనివాసులు, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక అవగాహన

- శక్తి యాప్, ఆపరేషన్ చిన్నారి తల్లి, ఆపరేషన్ దండాయనపై విస్తృత ప్రచారం
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థల్లో భద్రతా అవగాహన



**నెల్లూరు, ఆగస్టు 9**
మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శక్తి యాప్, ఆపరేషన్ చిన్నారి తల్లి, ఆపరేషన్ దండాయనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థినులు, తల్లిదండ్రులకు శక్తి యాప్ భద్రతా ఫీచర్లు, అత్యవసర సమయంలో వినియోగించే విధానాన్ని వివరిస్తున్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టంపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసర పోలీసు సహాయం కోసం 112, చిన్నారుల రక్షణ కోసం 1098, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచిస్తున్నారు.

# సత్‌ప్రవర్తనతో జీవించండి నేర ప్రవృత్తికి స్వస్తి పలకండి





- అనుమానాస్పద ఘటనలపై 112కు సమాచారం
- పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సాప్ 9392903413

**నెల్లూరు, ఆగస్టు 9**
శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల, ఐపీఎస్ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, కేడీలు, డీసీలు, ఇతర నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు పోలీసులు ప్రత్యేక సత్‌ప్రవర్తనా కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. రౌడీయిజం, దౌర్జన్యాలు, బెదిరింపులు, గొడవలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడితే జీరో టాలరెన్స్‌తో చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సీసీ కెమెరాలు, బీట్ వ్యవస్థ ద్వారా నేర నియంత్రణను మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. అనుమానాస్పద ఘటనలపై 112 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సాప్ 9392903413కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# కూటమిలో విభేదాలు సృష్టించేందుకు బాలినేని యత్నం





- తప్పుడు లేఖల వెనుక బాలినేని అనుచరుడి హస్తం అని విచారణలో తేలింది
- అక్రమాలు, రౌడీయిజం కూటమి ప్రభుత్వంలో సాగవు

**ఒంగోలు, ఆగస్టు 9**
కూటమిలో విభేదాలు సృష్టించేందుకే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు విమర్శించారు. ఒంగోలు నగరంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాలినేని అమావాస్యకు ఒకసారి ఒంగోలు వచ్చి మీడియా ముందు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.
తమపై ఆరోపణలు చేస్తూ విజయవాడ నుంచి అబద్ధపు లేఖలు పోస్ట్ చేసింది బాలినేని అనుచరుడు బొమ్మినేని మురళి అని పోలీసుల విచారణలో తేలిందని తెలిపారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో బాలినేని చేసిన తప్పులు, అక్రమాలపై కరపత్రాలు వేస్తే పుస్తకాలు సరిపోవన్నారు. గత ప్రభుత్వంలో తమపై 79 కేసులు పెట్టించారని, పార్టీ మారడం వల్లే ఆయన జైలుకు వెళ్లకుండా తప్పించుకున్నారని పేర్కొన్నారు.
గతంలో రౌడీయిజం చేసినట్లు కూటమి ప్రభుత్వంలో చెల్లదని స్పష్టం చేశారు. జనసేన పార్టీని అడ్డం పెట్టుకుని బాలినేని వైసీపీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. బార్ షాపుల సిండికేట్ ద్వారా కోట్లు వసూలు చేశారని, తాను చేసిన అక్రమాలపై కానిపాకంలో ఒట్టు వేసేందుకు వస్తానని, బాలినేని రావడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు.
బాలినేని చేసిన ఆరోపణలు తప్పు అని, తాము రూపాయి కూడా ఇవ్వలేదని సాక్షులుగా పేర్కొన్న పావులూరి నాగేశ్వరరావు, గౌస్ భాషా స్వయంగా మీడియా ముందుకు వచ్చి తెలిపారని వివరించారు.
ఈ మీడియా సమావేశంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, ఏఎంసీ చైర్మన్ రాచగండ్ల వెంకట్రావు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మేదన్, సింగరాజు రాంబాబు, కొల్లా ప్రభాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఈనెల 10న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- మీకోసం -- ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం
- అర్జీదారులు వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చు



**ఒంగోలు, ఆగస్టు 9**
ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను (పిజిఆర్ఎస్) ఈ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.
అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల పరిష్కారంపై వారి అభిప్రాయాలను నేరుగా సేకరించి, పరిష్కార నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను ఫిర్యాదుదారులు స్కాన్ చేసి తమ సమస్య పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని తెలిపారు.
కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణతో పాటు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందడంతో పాటు, సమస్య పరిష్కారమైన అనంతరం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను నమోదు చేసి ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# డీఎస్సీ 2025 అక్రమాలు, నిరుద్యోగ సమస్యలపై వైఎస్సార్సీపీ బైక్ ర్యాలీ



- మంత్రి నారా లోకేష్ రాజీనామా కోరుతూ బైక్ ర్యాలీ
- కావలిలో ఆగస్టు 10న ఉదయం 9.30 గంటలకు ర్యాలీ

**కావలి, ఆగస్టు 9**
డీఎస్సీ 2025లో జరిగిన అక్రమాలు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై నిరసనగా మంత్రి నారా లోకేష్ రాజీనామా కోరుతూ కావలిలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. కావలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరగనుంది. ఆగస్టు 10న ఉదయం 9.30 గంటలకు కావలి ట్రంక్ రోడ్డులోని జెండా చెట్టు సెంటర్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై ముసునూరులోని రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసం వరకు కొనసాగనుంది. డీఎస్సీ 2025లో అక్రమాలు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కావలి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మరియు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ శ్రీ రామిరెడ్డి

# సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం






- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పాలన
- గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు శ్రీకారం

**పర్చూరు ,**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా అనేక సంస్కరణలు చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను పునఃప్రారంభించామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఆయా పథకాల ప్రయోజనాలు, అర్హతలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అనుచరులపై అక్రమ కేసులతో వేధిస్తున్నారు

- రాజకీయ కక్షసాధింపు చర్యలు తగవు
- ఆరోపణల లేఖ వ్యవహారంతో నాకు సంబంధం లేదు



**ఒంగోలు, ఆగస్టు 9**
తన అనుచరులపై కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఒంగోలు నగరంలోని తన నివాసంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు అవినీతికి పాల్పడ్డారని ఇటీవల ఒక పత్రం విడుదలైందని, ఆ పని తానే చేశానని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఎస్పీ విచారణ చేపట్టగా కిరణ్ అనే వ్యక్తి ఆ లేఖ విడుదల చేసినట్లు తేలిందని, అతడిని పోలీసు స్టేషన్‌కు కూడా తీసుకువచ్చారని స్పష్టం చేశారు. నిజాలు వెల్లడైనప్పటికీ, ఆ కేసు విషయంలోనే బొమ్మినేని మురళిపై కూడా కేసు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదుర్కొలేకనే తమ అనుచరులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

